సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 28 । జూలై । 2023



సున్నా వడ్డీకి సన్నద్ధం

సున్నా వడ్డీ రాయితీ అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దీనికి ఏర్పాట్లు చేస్తోంది.

- 8లో



ఆశపడితే అరకోటి పోయింది

రూ.2వేల నోట్ల మార్పిడికి వెళ్లిన ఓ వ్యాపారి మోసపోయాడు. దుండగులు అరకోటికి టోకరా వేశారు.

- 8లో



బండార్లమ్మకు చల్లదనం

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలోని స్కూల్‌వీధిలో ఉన్న బండార్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ముర్రాటలతో చల్లదనం చేశారు.

న్యూస్‌రీల్

'చట్టాలు కఠినంగా అమలు చేద్దాం'



సంయుక్త ప్రకటన చేస్తున్న ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల అధికారులు

అరసవల్లి: లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఇటు ఆంధ్రా, అటు ఒడిశా రాష్ట్రాల వైద్యాధికారులు సంయుక్తంగా తీర్మానించారు. ఈ మేరకు గురువారం గంజాం జిల్లా బరంపురం ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ఉమాశంకర్ మిశ్రా (ఒడిశా) అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు. ఈ రెండు రాష్ట్రాల ఉమ్మడి సరిహద్దు ప్రాంతాల్లో స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అలాగే ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పని చేస్తుందని ప్రకటించారు. స్థానిక జిల్లాలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల్లో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పురుషుల కంటే స్త్రీలు తక్కువగా ఉన్నందున లింగ నిర్ధారణ స్కానింగ్ చేసే వారిపై కఠిక చర్యలు చేపట్టి, ఆడపిల్లల పుట్టుకను పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ, డాక్టర్లు సరోజినిదేవి, శక్తికుమార్ దిగాల్, ప్రఫుల్ల కుమార్ పాత్రో, జిల్లా మాస్‌మీడియా అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న హోంగార్డు కమాండెంట్ రామ్‌మోహన్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు విశాఖపట్నం రేంజ్ హోంగార్డు కమాండెంట్ యు.రామ్‌మోహన్ రావు అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం హోంగార్డులకు దర్బార్ కార్యక్రమం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. హోం గార్డులు నేర పరిశోధన, ట్రాఫిక్, నేర నియంత్రణ దర్యాప్తులో పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలు ప్రతి ఒక్కరికీ ఉంటాయని, అనుకూల దృక్పథంతో ముందుకు సాగితే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం హోంగార్డు సేవలు గుర్తిస్తుందని, పనికి, సేవలకు దగ్గ వేతనం, సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఆర్ఐ ఎస్.మహమ్మద్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యంపై దృష్టి



మెడికల్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: గిరిజన గ్రామాల్లో వైద్య సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. టెక్కలి డివిజన్ పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారులతో గురువారం టెక్కలిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో అందజేస్తున్న వైద్య సేవలపై ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలన్నారు. పంచాయతీ స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. 'ఫ్రై డే డ్రై డే' కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే సమయంలో అక్కడ గుర్తించిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు పీహెచ్‌సీ స్థాయిలో ఎంసీఆర్ రిజిస్ట్రేషన్స్‌పై ఆరా తీశారు. పీహెచ్‌సీల్లో నాడు–నేడు ప్రగతి, హెడీఎస్ నిధుల గురించి తెలుసుకున్నారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో ప్రసవాలు జరగకపోవడంపై ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొత్తపల్లి, బైదలాపురం పీహెచ్‌సీ డీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసీ పాల్గొన్నారు.

అభూత కల్పన..

అవాస్తవాల ప్రచురణ

- శ్రీకాకుళంలో జరిగిన ఓ ఘటనను గంజాయితో లింకు పెట్టిన పచ్చ పత్రిక
- టీడీపీ మాజీ కౌన్సిలర్‌తో జరిగిన గొడవను తప్పుగా చిత్రీకరించిన వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారమే లక్ష్యంగా అవాస్తవాల ప్రచారం
- ఈనాడు కథనాన్ని కొట్టి పారేసిన పోలీసులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : గంజాయి రాజ్యంలో ముఠాల అరాచకం పేరుతో ఈనాడు అచ్చేసిన కథనం అభాసుపాలవుతోంది. శ్రీకాకుళంలో జరిగిన ఓ ఘటనను గంజాయికి ముడిపెడుతూ వండి వార్చిన ఈ కథనాన్ని పోలీసులు కూడా కొట్టి పారేశారు. ప్రతీ ఘటనకూ వైఎస్ జగన్ ప్రభుత్వంతో లింకు పెట్టి దుష్ప్రచారానికి పాల్పడుతున్న పచ్చ పత్రిక పైత్యానికి ఇది మరో ఉదాహరణగా నిలిచింది.

వాస్తవమిది..

శ్రీకాకుళంలోని దమ్మలవీధిలో గత నెల 23న టీడీపీ మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబుపై ముగ్గురు యువకులు దాడి చేసినట్టుగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చింది. ఆ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగి, ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి ఆరా తీశారు. వండాన ఢిల్లేశ్వరరావు కుమారుడు జన్మదిన వేడుకలు బంధువులు, మిత్రుల సమక్షంలో జరుగుతుండగా ట్రాఫిక్ క్లియరెన్స్ విషయంలో అటువైపు వెళ్తున్న టీడీపీ మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబుకు, స్థానిక యువకులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంలో మాటామాటా పెరగడంతో చేతులతో రాంబాబును ముగ్గురు యువకులు తోసేశారు. అయితే రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆ యువకులు దాడి చేసినట్లు, షర్ట్ కాలర్ పట్టుకుని కత్తి చూపించి బెదిరించినట్లు పేర్కొని ఉంది. కానీ వాస్తవానికి ఇలా జరగలేదని పోలీసు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై దమ్మల వీధికి చెందిన పెద్దలు జోక్యం చేసుకుని, పోలీసు స్టేషన్‌కు వెళ్లిన పంచాయతీని రాజీ చేశారు. దమ్మలవీధి పెద్దలు, యువకులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు సమావేశం ఏర్పాటు చేసుకుని, ఇక నుంచి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకునేలా ఉంటామని, పెద్దలు ఎం.నర్సింహమూర్తి, జి.మూర్తి, జి.కొర్లయ్య, ఎం.రాంబాబు సమక్షంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబుకు యువకులు క్షమాపణలు కోరారు. పోలీసుల సమక్షంలో యువకులు క్షమాపణ కోరినందున పెద్ద మనసుతో వారిపై కేసును రాజీకి వస్తున్నానని రాంబాబు కూడా రాజీ పత్రం సమర్పించారు. ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు.

ఈనాడు కథనమిది..

ఈ ఘటనను ఈనాడు పత్రిక భూతద్దంలో చూపించి, గంజాయితో లింకు పెట్టి, దాని వల్ల ఈ ఘటన జరిగిందని చెప్పి, ఫిర్యాది కూడా ప్రస్తావించని అంశాన్ని సైతం జోడించి తప్పుడు వార్త రాసింది. పోలీసులు విచారణలో యువకులు గంజాయి సేవించలేదని, రాడ్లులతో దాడి చేయలేదని, కత్తులతో బెదిరించలేదని, చేతులతోనే తోసి మాధవ్ అనే వ్యక్తి మాత్రమే దాడి చేశారని నిర్ధారణ కూడా అయింది. అయినప్పటికీ పోలీసులు వెనక్కి తగ్గకుండా ఇది గుర్తించదగిన కేసు కానందున కోర్టు అనుమతితో కేసు కట్టేందుకు మెమోను సమర్పించారు. ఈనాడు పత్రిక ఇవన్నీ పక్కన పెట్టి ప్రభుత్వంపై దుష్ప్రచారానికి దిగింది.

గంజాయితో లింకు పెడితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఇష్టారీతిన రాతలు రాసింది. ఇప్పటికిప్పుడే వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని దించేయాలన్న కసితో అడ్డగోలు రాతలు రాసి ప్రజల్ని గందరగోళానికి గురి చేసే ప్రయత్నం చేసింది.



గంజాయిపై ఉక్కుపాదం

నగరంలో ప్రస్తుతం గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ఉదయం, మధ్యాహ్నం నాలుగు బీట్లు (రెండు పోలీసు జీపులు, రెండు టూవీలర్లు), రాత్రి వేళ మరో నాలుగు బీట్లు ప్రతిరోజూ నిఘా పెడుతూ పనిచేస్తున్నాయి. ఒక్కో బీటులో ఇద్దరు హెచ్‌సీలు, ఇద్దరు పీసీలు ఉంటున్నారు. వారికి ఏఎస్‌ఐ, ఎస్‌ఐ, సీఐలు సారథ్యం వహిస్తున్నారు. అంతే కాక ఇటీవల 70 మంది యువకులను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇప్పించి,తహసీల్దారు సమక్షంలో బైండోవర్ కూడా కట్టించారు. ఇంత పకడ్బందీగా ఉంటుంటే... ఈనాడులో లేనిపోనివి రాశారని, అందులో వాస్తవం లేదని సీఐ లెంక అప్పలనాయుడు స్పష్టం చేశారు.

ఐదుగురికి రూ.67.80 లక్షలు

- 'జగనన్న విదేశీ విద్యా దీవెన'తో ఉన్నత చదువులకు ప్రభుత్వం అండ



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కిల్లి కృపారాణి, అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే సామాన్యులకు వైఎస్ జగన్ సర్కారు అండగా నిలుస్తోందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈ పథకం కింద జిల్లాలో ఐదుగురికి రూ. 67.80 లక్షలు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. బటన్ నొక్కి 357 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ. 45.53 కోట్లను జమచేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీ కృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో గల టాప్ 50 విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లేదా ఇతర కోర్సులలో విద్యను అభ్యసించే వారికి శత శాతం ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 357 మంది విద్యార్థులకు దాదాపు రూ.45.53 కోట్లు రెండో విడతగా విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఐదుగురు అర్హులకు రెండో విడతలో రూ. 67.80 లక్షలు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ పథకానికి అర్హత గల ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా విదేశీ విద్యను పొందాలని కలెక్టర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ నమూనా చెక్కు అందజేశారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కుటుంబాలు



తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: మండలంలోని సువర్ణపురం పంచాయతీలోని టీడీపీకి చెందిన 50 కుటుంబాలు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. సువర్ణపురంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వీరంతా పార్టీలో చేరగా మంత్రి అప్పలరాజు, ఎంపీపీ డొక్కరి దానయ్య కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులయ్యామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల తీరు తమకు నచ్చడం లేదన్నారు. పలాస నియోజకవర్గ ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిలబెట్టి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని కొనియాడారు.

అనంతరం మంత్రి సీదిరి మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకున్న నాయకులు టీడీపీని వీడి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి చేరారన్నారు. మన ప్రాంతాన్ని మనమే అభివృద్ధి చేసుకుందామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు తనతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో పి.పురుషోత్తం, తామాడ రమేష్, బదకల నాగేశ్వరరావు, పసుపురెడ్డి సోమేశ్వరరావు, తామాడ కుమారస్వామి, సాత్ర లలిత, పుచ్చ కృష్ణారావు, రామయ్య, లక్ష్మణరావు, డొక్కరి తులసీరావు, టి.హిమావతి, డి.త్రివేణి తదితరులు ఉన్నారు.

'యువతలో నైపుణ్యాలు కీలకం'



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఎచ్చెర్ల క్యాంపస్: యువతలో నైపుణ్యాలు కీలకమని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం విద్యార్థుల వీడ్కోలు సదస్సు గురువారం సెమినార్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడా రు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పారు. ప్రభుత్వం ఉన్నత విద్యను ప్రోత్సహిస్తోందని చెప్పారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు రిలీవ్ నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించాలని అన్నారు. వర్సిటీలో ప్లేస్‌మెంట్ సెల్ బలోపేతం చేసి పలు కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో స్కిల్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ డి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం పారిశ్రామిక రంగరంలో అనేక మార్పు లు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా విద్య సాగాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, చింతాడ రాజశేఖర్‌రావు, పాల్గొన్నారు.

కుదిపేసిన వాన

అండర్ పాసేజ్‌లు మునిగిపోయాయి. పొలాల్లోకి నీళ్లు చేరాయి. రోడ్లు జలమయమయ్యాయి. రాకరాక వచ్చిన వర్షం సిక్కోలును కుదిపేసింది. అధిక శ్రావణంలో నాలుగు రోజుల పాటు దంచికొట్టిన వాన నదులు, చెరువులు, కాలువలకు కొత్త కళ తెచ్చింది. అయితే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పొలాలు, ప్రాంతాలు నీట మునిగాయి. అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు సైతం నేలకూలాయి.

- నీట మునిగిన పొలాలు, అండర్ పాసేజ్‌లు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతు తనివితీరా వాన కురిసింది. జూన్ నెల కొరతను అధిగమించేలా జూలైలో వర్షాలు దంచి కొట్టాయి. గురువారం కాస్త జోరు తగ్గినా అక్కడక్కడా జల్లులు పలకరించాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఈ నెలలో ఇప్పటికి 10 నుంచి 14 రోజుల పాటు వానలు కురిశాయి. గురువారం ఉదయానికి చాలా చోట్ల వాన తెరిపినిచ్చింది. గురువారం జిల్లా మొత్తం 1806.0 మిల్లీమీటర్ల వాన కురిసింది. సగటున 60.2 మిల్లీమీటర్లుగా నమోదైంది.



కానుకుర్తివానిపేట అండర్ పాసేజ్ వద్ద నిలిచిన నీరు

ముంచి'నది'



పాగోడు వద్ద నీట మునిగిన పంట పొలాలు

జలుమూరు: గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వంశధార నది పోటెత్తి ప్రవహిస్తోంది. మండల పరిధిలోని కాలువలు పొంగి పొర్లడంతో గురువారం పొలాలు నీట మునిగాయి. గుగ్గిలి, కూర్మనాథపురం, పాగోడు, మర్రివలస, కత్తెరివానిపేట తదితర గ్రామాలు పంట పొలాలు నీట మునిగాయి.

ముంపు ప్రాంతాల పరిశీలన



బుడ్డివలస గ్రామంలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: వరద ముంపు ప్రభావిత గ్రామాలైన బుడ్డివలస, కెజెపేట గ్రామాల్లో గురువారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులతో కలసి పర్యటించారు. క్షేత్రస్థాయి నుండే వంశధార, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

అండర్‌పాసేజ్‌లు

నరసన్నపేట: మండలంలోని నడగాం, కానుకుర్తువానిపేట, చిక్కాలవలస రైల్వే గేట్‌ల స్థానంలో నిర్మించిన అండర్ పాసేజ్‌లు నీటి మడుగులను తలపిస్తున్నాయి. ఇక్కడ బుధవారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. ఏకంగా రెండు గంటల్లో 11 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదైంది. దీంతో రైల్వే అండర్ పాసేజ్‌ల వద్ద నీరు అధికంగా చేరింది. గేట్‌కు 10 అడుగుల పైగా కింది భాగంలో అండర్ పాసేజ్‌లు నిర్మించడం, వాననీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అంతా ఒక్కచోట చేరింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నడగాం అండర్ పాసేజ్ వద్ద 8 అడుగుల వరకూ నీరు చేరింది. బుధవారం రాత్రి ఒక లారీ మధ్యలో ఆగిపోయింది. ఉదయానికి స్థానికుల సహకారంతో బయటకు తీశారు. ఈ మార్గం గుండా అల్లాడ, చోడవరం, ముద్దాడపేట, శివరాంపురం, తెలగవలస, చెన్నాపురం, గునబుపేట ఇలా పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అలాగే కానుకుర్తివానిపేట వద్ద అండర్ పాసేజ్ పనులు మధ్యలో నిలిపి వేశారు. ఇక్కడ 15 అడుగుల వరకూ నీరు చేరింది. బాడాం ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. చివరికి స్థానికుల సహకారంతో రైల్వే లైన్ పైనుంచే వెళ్లాల్సి వచ్చింది. ఈ మార్గం గుండా బాడాం, తోటాడ, పారశిల్లి, రెల్లివలస మొదలగు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. నీరు చేరడంతో పూర్తిగా రాకపోకలు నిలిచి పోయాయి. అలాగే చిక్కాలవలస గేట్ వద్ద 7 అడుగుల నీరు చేరింది. సుందరాపురం, కూర్మనాథపురంతో పాటు జలుమూరు మండలానికి చెందిన మరో 10 గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. నీరు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. సుందరాపురం ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. రైల్వే అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని బాడాం సర్పంచ్ డోల గోవిందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కింతలి చలపతిరావుతో పాటు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

కోటబొమ్మాళి మండలంలో..



తిలారు వద్ద నీటితో నిండిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి

కోటబొమ్మాళి: మండలంలోని తిలారు, నిమ్మాడ గ్రామాల మధ్యన ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో భారీవర్షం కారణంగా గురువారం 20 అడుగుల మేర నీరు నిండిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పక్కనే గల పాత రైల్వేగేటు ద్వారా వాహనాలను అనుమతించారు. అలాగే ఎత్తురాళ్లపాడు పంచాయతీ, పంతులపేట వద్ద గల రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రక్షణగోడ కూలిపోయింది. రైల్వేసిబ్బంది పొక్లెయినర్‌తో కూలిపోయిన రాళ్లు, మట్టిని తొలగించారు.

ముంపులో 600 ఎకరాలు



గార: భారీ వానలకు మండలంలో 600 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. మరో రెండు రోజుల పాటు నీటిలో ఉంటే మొక్క కుళ్లిపోయే పరిస్థితి తలెత్తుతుంది.

విరిగిన విద్యుత్ స్తంభాలు

ఆమదాలవలస రూరల్: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నిమ్మతొర్లాడ, నారిపేట, తోటాడ, గొల్లపేట, గాజులకొల్లివలస, చీమలవలస, జీకేవలస తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వీటిని బాగు చేసినట్లు ఏఈ బి.రవికుమార్ తెలిపారు.



నిమ్మతొర్లాడ వద్ద విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

చెరువును తలపిస్తున్న అండర్ టన్నెల్ వే

ఆమదాలవలస: మూడు రోజులుగా కురిసిన వానకు ఆమదాలవలస రైల్వేస్టేషన్ పరిధి అండర్ టన్నెల్ చెరువును తలపిస్తోంది. దీంతో ఆ రహదారి గుండా ప్రయాణించే మెట్టక్కివలస, అక్కివలస, పంతులపేట, బీఆర్ నగర్, ఆమదాలవలస గేటు తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇబ్బంది తప్పడం లేదు.



అండర్ టన్నెల్ వేలో నిల్వ ఉన్న వర్షపు నీరు

(వర్షపాతం మిల్లీ మీటర్లలో)

ఎచ్చెర్ల	ఆమదాలవలస	బూర్జ	శ్రీకాకుళం	జలుమూరు	సరుబుజ్జిలి	నరసన్నపేట	పొందూరు	పోలాకి	గార	రణస్థలం	లావేరు	సారవకోట	జి.సిగడాం	ఎల్.ఎన్.పేట
127.6	122.8	120.4	108.8	103.4	103.4	99.2	93.2	88.4	80.6	78.4	74.2	64.8	64.8	60.2

కోటబొమ్మాళి	కొత్తూరు	హిరమండలం	సంతబొమ్మాళి	మెళియాపుట్టి	టెక్కలి	పాతపట్నం	కవిటి	ఇచ్ఛాపురం	మందస	పలాస	సోంపేట	కంచిలి	నందిగాం	వజ్రపుకొత్తూరు
57.0	51.2	41.6	36.8	26.4	26.4	24.8	24.8	24.0	21.8	21.4	19.6	16.4	14.4	13.8

క్లుప్తంగా

హెచ్ఐవీ రిపోర్టులను ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న కామేశ్వరప్రసాద్ తదితరులు

అరసవల్లి: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ పరీక్షల నెలవారీ నివేదికలను సోచ్ అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి నెలా అప్‌లోడ్ చేయాలని నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ కామేశ్వర ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి అధ్యక్షతన గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీకి సంబంధించి కేవలం స్క్రీనింగ్ పరీక్షలు మాత్రమే చేస్తున్నారని, పాజిటివ్ వచ్చిన వారికి సమీపంలోని ఐసీటీసీ కేంద్రానికి తరలించే బాధ్యత కూడా ఆయా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఐవీ నియంత్రణ మండలి ప్రతినిధి రాజేంద్రప్రసాద్, డీసీహెచ్ఎస్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


పనుల్లో నాణ్యత పాటించాలి



పొన్నాడలో కాలువ పనులు పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందికి సూచించారు. గురువారం ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీలో కాలువ పనులు, 2023–24 ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శోభాదేవీ, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ కింగ్‌కోబ్రా హతం



20 అడుగుల కింగ్ కోబ్రా

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ జెన్నాగాయి గ్రామ పంట పొలాల్లో 20 అడుగుల కింగ్ కోబ్రా పాము గురువారం హల్‌చల్ చేసింది. భయాందోళనకు గురైన స్థానికులు కర్రలతో పామును స్థానికులు హతమార్చారు.

ముమ్మరంగా వరినాట్లు



బూర్జ సమీపంలో నాట్లు వేస్తున్న రైతులు

బూర్జ: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బూర్జ, నీలాదేవిపురం, కొల్లివలస, మదనాపురం, పాలవలస, డొంకలపర్త, అల్లిన, పెద్దపేట తదితర గ్రామాల్లో నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,160–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,150–00
వెండి (కిలో)	80,400–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సున్నావడ్డీకి సన్నద్ధం



- త్వరలో వరుసగా నాలుగో ఏట అమలు
- జిల్లాలో 51,743 సంఘాలకు లబ్ధి
- రూ.69.06 కోట్లు జమ చేసేందుకు సన్నాహాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సున్నా వడ్డీ రాయితీ అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మూడు విడతల్లో సున్నావడ్డీ రాయితీని మహిళా సంఘాలకు జమ చేసిన సంగతి తెలిసిందే. త్వరలో నాలుగో విడత అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే వడ్డీ లేని రుణాలు, జగనన్న తోడు, ఆసరా పథకాలతో మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.



జిల్లాలో డీఆర్‌డీఏ పరిధిలో 30 మండలాలు, అర్బన్ మెప్మా పరిధిలో నాలుగు పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటిలో అన్ని స్వయం శక్తి సంఘాలు వాడిన రుణాలపై వడ్డీ రాయితీ విడుదల చేస్తున్నా రు. నాలుగో విడతలో డీఆర్‌డీఏ పరిధిలో 47359 స్వయం శక్తి సంఘాల్లోని 5,43,545 మంది సభ్యులకు రూ.61.93 కోట్ల మేర సున్నా వడ్డీ రాయితీని అందజేయనున్నారు. మెప్మా పరిధిలో పట్టణాల్లో ఉన్న 4384 స్వయం శక్తి సంఘాల్లోని 44235 మంది సభ్యులకు రూ.7.93 కోట్లు విడుదల చేస్తున్నారు. మొత్తంగా 51,743 సంఘాల్లోని, 597770 మంది సభ్యులకు రూ.69.06 కోట్లు జమ చేయనున్నారు.

డీఆర్‌డీఏ పరిధిలో..

నియోజకవర్గం	సంఘాలు	సభ్యులు	సున్నావడ్డీ రాయితీ
ఆమదాలవలస	4589	52215	5.87
ఎచ్చెర్ల	7790	88914	11.49
ఇచ్ఛాపురం	6535	76597	8.13
నరసన్నపేట	6175	70723	7.93
పలాస	4887	56885	5.84
పాతపట్నం	6076	70111	7.03
శ్రీకాకుళం	4488	50583	6.29
టెక్కలి	6819	77517	8.55
మొత్తం	47359	543545	61.13 కోట్లు

మెప్మా పరిధిలో..

పట్టణం	స్వయంశక్తి సంఘాలు	సున్నావడ్డీ రాయితీ
ఆమదాలవలస	705	1.28
ఇచ్ఛాపురం	742	1.33
పలాస–కాశీబుగ్గ	1020	1.84
శ్రీకాకుళం	1917	3.48
మొత్తం	4384	7.93

సంఘాల బలోపేతం..

సున్నా వడ్డీ రాయితీ జమకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వడ్డీ రాయితీ వల్ల మహిళా స్వయం శక్తి సంఘాలకు వడ్డీ భారం తగ్గుతుంది. బ్యాంకు నుంచి వాడిన రుణానికి వడ్డీని ప్రభుత్వమే నేరుగా సంఘం సభ్యుల ఖాతాల్లో జయ చేయడంతో వారికి ఎంతో మేలు కలుగుతోంది. త్వరలోనే నాలుగో విడత అమలు కానుంది.

– డాక్టర్ విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న, శాస్త్రవేత్త దివంగత అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు అన్నారు. అబుల్ కలాం వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని మహాత్మాజ్యోతిరావు పూలే పార్కులో ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నక్క గణపతిరావు, దేశల్ల గోవిందు, మల్లిబాబు, కర్రి రంగాజీదేవ్, ఉపాధ్యక్షులు గుత్తు చిన్నారావు, పసగాడ రామకృష్ణ, కాయితీ వెంకటరమణ, పాలిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ భవనంలోనూ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సభ్యులు చిన్మయరావు, గుణాకరరావు, నరసింగరావు, కె.సత్యనారాయణ, బి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న రాష్ట్రస్థాయి రైతు కార్మికుల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర ప్రకాశరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక విధానాలకు నిరసనగా ఈ నెల 30న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి రైతు కార్మికుల సదస్సును విజయవంతం చేయాలని ఎస్‌కేఎం నాయకులు కోరారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జీడి రైతులకు రూ.16 వేలు గిట్టుబాటు ధరను తక్షణమే ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మణిపూర్ మారణ హోమంలో మరణించిన వారికి నివాళులర్పించారు. సమావేశంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు కె.మోహన్ రావు, బి.శ్రీరామమూర్తి, జి.సురేష్ కుమార్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎన్.నీలంరాజు, గంగరాపు సింహాచలం, పి.చంద్రరావు, పోలాకి ప్రసాదరావు, చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కేంద్రం



కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద నాయకులు, రైతులు, పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 159 కేంద్రాలు ప్రారంభిస్తూ పీఎం కిసాన్ కింద రూ.2వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమచేశారు. వ్యవసాయశాఖ, ఐపీఎల్ ఆధ్వర్యంలో ఐపీఎల్ రాష్ట్ర చీఫ్ మేనేజర్ వి. లోగమూర్తి, సేల్స్ ఆఫీసర్ విజయ్‌కుమార్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఆత్మ పి.డి. కృష్ణారావు, బుడుమూరు తిరుమలరావు, విశ్రాంత డీఈ బగాది వేణుగోపాల్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా అకడమిక్ క్యాలెండర్ రూపకల్పన



అధికారులతో సమీక్షిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అధికారులు, విభాగాధిపతులు పక్కాగా అకడమిక్ క్యాలెండర్ సిద్ధం చేసి తరగతులు నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆదేశించారు. విశ్వవిద్యాలయంలో గురువారం అధికారులు, విభాగాధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమిస్టర్ వారీగా క్లాస్‌వర్కు జరగాలన్నారు. మిడ్ సెమిస్టర్, సెమిస్టర్ పరీక్షలు సక్రమంగా జరగాలని చెప్పారు. డిగ్రీ కళాశాలల వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 29తో ముగియనుందని తెలిపారు. కళాశాలలపై కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. నిబంధనలు పాటించని 11 డిగ్రీ కళాశాలల్లో ఉన్నత విద్యా మండలి ప్రవేశాలు నిలిపివేసిందన్నారు. పీజీ ప్రవేశాలు మొదలయ్యేలోగా డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని సూచించారు. పీజీ, బీఎడ్, బీపీఈడీ నాలుగో సెమిస్టర్, ఇంజినీరింగ్ ఎనిమిదో సెమిస్టర్ జవాబు పత్రాలు మూల్యాంకణ త్వరితగతిన ప్రారంభించాలన్నారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ జవాబు పత్రాలు మూల్యాంకణం త్వరితగతిన, పారదర్శకంగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కువ మార్కులు, తక్కువ మార్కులు వచ్చిన జవాబుపత్రాలను మరోసారి పరిశీలించాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్ రావు, సీడీసీ డీన్ పీలా సుజాత, వర్సిటీ ఇంజినీర్ అజిత్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ రైల్వేగేటు మూసివేత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో అత్యంత రద్దీగా ఉండే కాశీబుగ్గ ఎల్‌సీ రైల్వేగేటును మరమ్మతుల నేపథ్యంలో రాత్రి సమయంలో మూసివేస్తున్నట్లు పలాస రైల్వేస్టేషన్ సీనియర్ ఇంజినీర్ బి.వి.ఎస్.గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1 వరకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మూసివేత వర్తిస్తుందని, ప్రయాణికులు గుర్తించాలని కోరారు.

ప్రశాంత్‌కుమార్‌కు మిస్సైల్‌మేన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అంపిలి ప్రశాంత్‌కుమార్

కొత్తూరు: విజయవాడకు చెందిన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా గురువారం కొత్తూరు మండలం గూనభద్రకు చెందిన విద్యావేత్త, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు అంపిలి ప్రశాంత్‌కుమార్‌కు మిస్సైల్‌మేన్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్‌ప్రేషనల్ అవార్డు–2023ను ప్రదానం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చేతుల ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాల అమల్లో శ్రద్ధ చూపించడం, విద్యారంగ పరిరక్షణకు కృషి చేసినందుకు గాను అవార్డు అందించారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



తూలుగు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

గార: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం తూలుగు సబ్‌స్టేషన్ వద్ద దశలవారీ ఆందోళన ప్రారంభించారు. జేఎల్ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెండింగ్ డీఏలు చెల్లించడం, ఏకసభ్య కమిషన్ రద్దు చేయడం, సచివాలయ ఉద్యోగులకు ఎస్ఆర్ కల్పించడం వంటి డిమాండ్లతో ధర్నా నిర్వహించారు.

ఆశపడితే అరకోటి పోయింది!

- రూ.2 వేల నోట్ల మార్పిడికి వెళ్లి మోసపోయిన బంగారం వ్యాపారి
- అసలు కంటే అదనంగా నోట్లు ఇస్తామని చెప్పి దౌర్జన్యానికి దిగిన ముఠా
- రూ.50 లక్షల విలువైన రూ.500 నోట్ల కట్టలతో పరార్
- కాశీబుగ్గలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

కాశీబుగ్గ: అత్యాశకు పోయిన ఓ వ్యాపారి రూ.50 లక్షలు పోగొట్టుకున్నాడు. కాశీబుగ్గలో ఇటీవల జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. రూ.50 లక్షల విలువైన రూ.500 నోట్ల కట్టలు అందిస్తే అంతకు పది శాతం అదనంగా రూ.2వేలు నోట్లు ఇస్తామనే ఒప్పందం మేరకు నరసన్నపేట పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి తంగుడు సందీప్‌కుమార్ ఈ నెల 23న పలాస వెళ్లారు. తన వెంట రూ.500 నోట్ల కట్టలు ఉన్న రూ.50 లక్షల బ్యాగు పట్టుకున్నారు. సన్నిహితుడైన సూర్యప్రకాష్, మధ్యవర్తిత్వం గల మరో వ్యక్తి నోట్లు మార్చేందుకు పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని ఎంచుకున్నారు. సాయంత్రం వరకు వేచి ఉన్నారు. నోట్ల మార్పిడి డీల్ వేరే చోట జరుగుతుందని నమ్మబలికిన అవతల టీం సభ్యులు ప్లాన్ మార్చేశారు. పోలీసుల మాదిరిగా బొలేరోలో వచ్చి రూ.2వేల నోట్లు ఇవ్వకుండానే దౌర్జన్యం చేసి అడ్డుకున్న వారిపై దాడికి పాల్పడి రూ.50 లక్షలు ఉన్న బ్యాగును ఎత్తుకుపోయారు. మొగిలిపాడు మీదుగా జాతీయ రహదారికి చేరుకుని లక్ష్మీపురం టోల్‌గేటు దాటేశారు. బాధితులు వెంబడించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బయటకు చెప్పలేక ఇంటిముఖం పట్టారు. ముఠాకు చెందిన మధ్యవర్తులు కృష్ణ, రాధాకృష్ణల కారు ఆచూకీని బాధితులు తెలుసుకుని ఈ నెల 24న కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సీఐ శ్రీనివాసరావు పట్టించుకోకపోవడంతో బాధితులు ఎస్పీ జి.ఆర్.రాధికకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆగ్రహించడంతో ఈ నెల 26న కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

చురుగ్గా ఇంటింటా ఓటరు సర్వే



ఇంటింటా ఓటర్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్/లావేరు: గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటా ఓటర్ల సర్వే చురుగ్గా చేపడుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వారు ఉంటే కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న వారికి మార్పులు, చేర్పులు అవసరమైతే సరిచేస్తున్నారు. శ్రీకాకులం రూరల్ మండల పరిధిలోని ఇప్పిలి గ్రామంలో గురువారం జరిగిన ఓటర్ సర్వేను తహశీల్దార్ ఎస్.వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్‌కు సమీపంలోనే ఓట్లు నమోదు అయ్యేలా చూసుకోవాలన్నారు. ఓటర్ కార్డులకు ఆధార్ నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కొత్తగా ఎవరైనా ఓట్లు నమోదు చేసుకోవాలంటే బీఎల్‌ఓను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, కరణం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ నిందితులను శిక్షించాలి



శ్రీకాకుళం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దేశవ్యాప్త ధర్నా కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం సంచారభవన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఆటవికంగా అత్యాచారం చేసిన ఉన్మాదులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే శాంతి నెలకొల్పి ప్రజలను రక్షించాలని కోరారు. ధర్నాలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు లక్ష్మి, అరుణ, శారద, ఎం.వెంకటరావు, వి.శ్రీనివాసరావు, అభిమన్యు, డి.శ్రీనివాసరావు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో కొవ్వొత్తుల నిరసన

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం: 'మణిపూర్'లో మహిళలపై దారుణ, మారణకాండ బాధాకరమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర అన్నారు. మణిపూర్ మారణకాండను నిరసిస్తు.. యూటీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం డైమండ్ పార్క్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు ర్యాలీగా వెళ్తు కొవ్వొత్తులుతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు ఎస్.కిషోర్‌కుమార్ , సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజస్వి, పోస్టల్ అసోసియేషన్ నాయకులు గణపతిరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, జిల్లా నాయకులు హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్‌కుమార్, బి.రవికుమార్, మండలశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

ఓపెన్ స్కూల్ ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) జూన్/జూలైలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫలితాలు గురువారం వెలువడ్డాయి. జూన్ 26 నుంచి జూలై 4 వరకు ఈ పరీక్షలు జరిగాయి. టెన్త్ ఫలితాల్లో 620 మందికి 359 (57.90 శాతం) మంది, ఇంటర్‌లో 965 మందికి 443 (45.91 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఆగస్టు 4 వరకు ఏపీ ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జి డీఈవో ఎం.జ్యోతికుమారి తెలిపారు. పరీక్ష ఫలితాలు, మార్కుల మెమోల కోసం ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాకు గుర్తింపుపై హర్షం

శ్రీకాకుళం న్యూకాలనీ: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాని గుర్తించి 29 రాష్ట్రాలు ఏడు క్యాంపస్ ప్రాంతాల్లో ఉన్న సంఘాలకు గుర్తింపు లభించడం పట్ల ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, కార్యదర్శి పి.సత్యనారాయణ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కొంతమంది స్వార్థపూరిత వ్యక్తుల కారణంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌లో చీలిక వచ్చిందని, అయితే న్యాయమే గెలిచిందని చెప్పారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కి గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయినందున ఇకపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హ్యాండ్‌బాల్‌పై అధ్యక్ష కార్యదర్శులు సంఘానికి మాత్రమే గుర్తింపు ఉందని స్పష్టం చేశారు. ఈ అసోసియేషన్ కింద ఆడిన క్రీడాకారుల సర్టిఫికెట్స్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉంటుందని, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, హ్యాండ్‌బాల్ పోషకులు, సీనియర్ క్రీడాకారులు గమనించగలరని కోరారు. ఈ మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

'రైతులు జాగ్రత్తలు తీసుకోండి'



వరి పొలంలో నీరుచేరిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా పొలాలు ముంపునకు గురైతే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయశాఖ జిల్లా అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

- ముంపునకు గురైన పొలాల్లోని నీటిని కాలువల ద్వారా బయటికి త్వరగా పోయేలా చేయాలి. ఇలా చేయకుంటే వేరు వ్యవస్థ కుళ్లిపోతుంది.
- వరద నీటిని పొలాల నుంచి తీసివేసిన తర్వాత 13 :0: 45 లేదా 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అలాగే ప్రధాన పొలాలతో పాటు ఎరువులు బూస్టర్ డోస్ యూరియా 25 కేజీలు, పొటాష్ 10 నుంచి 15 కేజీలు ఎకరానికి వేసుకోవాలి.
- ముంపు కారణంగా పంటకు తీవ్ర నష్టం వాటిల్లితే అడ్జస్ట్, స్వల్పకాలిక రకాలైన ఎంటియు 1010, ఎంటియు 1121, ఎంటీయూ 1156, ఎంటియు 1153 రకాలను తిరిగి దమ్ము చేసుకుని పొలంలో నేరుగా వెద వేసుకోవాలి.